నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం
25 జూన్ 2025 పేజీలు : 08







# సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్ !

**జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి**

- చంద్రబాబుకే నాలుక మందం
- డబుల్ ఇంజన్ కాదు.. ట్రబుల్ ఇంజన్
- గుండె మీద చేయి వేసుకొని చంద్రబాబు సమాధానం చెప్పాలి
- ఎన్నికల ముందు మహిళా శక్తి పథకాన్ని పీ4లో కలుపుతామని ఎందుకు చెప్పలేదు ?
- మానవత్వం గురించి జగన్‌కి మాట్లాడే హక్కు లేదు
- జగన్ గురించి మాట్లాడటం.. నా అజెండా కాదు
- 5 ఏళ్లు మద్యం కుంభకోణం చేసి.. ఇప్పుడు జనాల మధ్యకు రావడం విడ్డూరం
- పోరాటాలు చేసే నాకు అనుమతి ఇవ్వరు.. టైర్ల కింద తొక్కుకుంటూ పోయేవాళ్ళకు అనుమతులిస్తారు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :**

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, వైసీపీ మూడు బీజేపీ పార్టీలేనని, ఒకరిది సక్రమ పొత్తు, మరొకరిది అక్రమ పొత్తు అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. నగరంలోని ఇందిరా భవన్ లో నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డి హాజరయ్యారు. తొలుత నెల్లూరు రూరల్ పరిధిలోని ఆకుతోట గిరిజన కాలనీ నుంచి ఇందిరా భవన్ వరకు భారీ ర్యాలీలో పాల్గొన్నారు. గాంధీ బొమ్మ సెంటర్ వద్ద తన తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఇందిరాభవన్ చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారంలో ఉన్న 5 ఏళ్లలో జగన్ కూడా బీజేపీకి ఊడిగం చేశాడన్నారు. వైఎస్ఆర్ కొడుకు అయ్యి ఉండి బీజేపీ అన్ని బిల్లులకు మద్దతు ఇచ్చారన్నారు. ఇప్పుడు చంద్రబాబు రాత్రి పడ్డ గొయ్యిలో పగలు పడ్డారన్నారు. రాష్ట్రానికి ఏ ఒక్క మేలు చేయని బీజేపీకి బాబు, పవన్ ఊడిగం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ గత 11 ఏళ్లుగా మోసం చేస్తూనే ఉందని, ప్రత్యేక హోదా మీద బీజేపీ మోసం చేసిందన్నారు. పోలవరం ఎత్తు తగ్గించి అన్యాయం చేసిందని, పోలవరం ఎత్తు తగ్గిస్తుంటే రాష్ట్ర ఎంపీలు ఒక్కరు కూడా మాట్లాడలేదన్నారు. ఒక్కరికి బీజేపీ మీద వ్యతిరేకంగా మాట్లాడే దమ్ము లేదన్నారు. విభజన హామీలు విస్మరిస్తుంటే నోరు మెదపరన్నారు. రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత అని, ఢిల్లీని మించే రాజధాని అంటూ మోసం చేస్తుంటే బాబు, పవన్ కనీసం ప్రశ్నించడం లేదన్నారు. ఏడాది పాలన అంతా గొప్పల మయం తప్ప ఏదీ లేదన్నారు. డబుల్ ఇంజన్ కాదు.. -మిగతా 6లో

## సీఐడీ కేసులో కాకాణికి 2 రోజుల పోలీస్ కస్టడీ..



**కోర్టు ఉత్తర్వులు**

2లో

## చిన్నారిని ఆదుకుంటాం





- ఎమ్మెల్యే ప్రశాంతమ్మ
- చిన్నారిని చిత్రహింసలు పెట్టిన వారిపై చట్టపర చర్యలకు ఆదేశం
- వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా బాధిత బాలికను ఆదుకుంటాం

02 పేజీలో

## పొదలకూరు లే-అవుట్‌లలో పబ్లిక్ ప్రాపర్టీ స్థలాలు భద్రమేనా ?

- తోడేరు పంచాయతీలో అసలేం జరుగుతోంది !
- లే అవుట్‌లో పబ్లిక్ ప్రాపర్టీ స్థలం కబ్జా
- నిద్రావస్థలో పంచాయతీ పాలకులు
- రూ.కోట్ల స్థలం స్వాహా యత్నం
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

పొదలకూరు మండలంలో పుట్టగొడుగుల్లా వెలసిన లే అవుట్లలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన పబ్లిక్ ప్రాపర్టీ స్థలాలు భద్రమేనా.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. కొన్ని లే అవుట్లలో పబ్లిక్ ప్రాపర్టీ స్థలాలుగా చూపినట్లు చూపి.. మళ్లీ విక్రయించేసి సొమ్ము చేసుకొంటున్నారు.



పబ్లిక్ ప్రాపర్టీ స్థలంలో దోజర్లు పెట్టి చదును చేస్తున్న వైనం

## నేడు నెల్లూరుకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి రాక



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి బుధవారం జిల్లాలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు నెల్లూరు చేరుకుని 1 గంట వరకు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. 2 నుండి 2.30 గంటల వరకు అధికార, అనధికార ప్రముఖులను కలుస్తారు. అనంతరం 2.30 గంటలకు పాత్రికేయ సమావేశం నిర్వహించి తిరిగి రోడ్డు మార్గం ద్వారా విజయవాడ చేరుకుంటారు.

### మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని

# ఉపేక్షించేది లేదు

## రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. ఇటీవల ఇందుకూరుపేట మండలం, కుడితిపాలెం కాకర్ల దిబ్బలో పదేళ్ల బాలిక చెంచమ్మపై అమానుషంగా వాతలు పెట్టడం.. అలాగే కనుపర్తిపాడు వద్ద 8 ఏళ్ల బాలికపై జరిగిన అఘాయిత్యాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన నిమిత్తం ఆమె మంగళవారం ఉదయం స్థానిక అపోలో హాస్పిటల్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. అదేవిధంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 10 ఏళ్ల చేంచమ్మను వారి తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తమై దూర ప్రదేశానికి వెళుతూ.. తెలిసిన వారి దగ్గర ఉంచడం జరిగిందని, అయితే వారి పక్కింట్లో సెల్‌ఫోన్ దొంగతనం జరిగిందనే నేపథ్యంలో మూఢనమ్మకాలకు పోయి జ్యోతిష్యులు (అంజనం వంటి వాటిని) మాట విని పక్కింట్లోని చిన్న పాప దొంగిలించిందని అభూత కల్పనని సృష్టించి ఆ అమ్మాయిని చిత్రహింసలు గురి చేయడం జరిగిందన్నారు. దీనిపై 5 మంది నిందితుల్లో నలుగురిని గుర్తించి అరెస్టు చేశారన్నారు. అదేవిధంగా కనుపర్తిపాడులో జరిగిన అఘాయిత్యానికి సంబంధించి నిందితుడిని తక్షణమే పోలీసులు అరెస్టు చేశారని, ఈ విషయంలో చిన్నారి బాలిక చూపిన తెగువ అభినందనీయమని తెలిపారు. చిన్నప్పటి నుండే చిన్నపిల్లలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తండ్రి, తాత వయసున్న వాళ్లు కూడా నేరుగా మాట్లాడక చిన్నపిల్లలతో కిందకి చూసి మాట్లాడడం ఆనవాయితీ అయిపోయిందని, ఇటువంటి పరిస్థితులు మారాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఫోక్సో చట్టం చాలా కఠినమైందని ఆమె అన్నారు. నిందితులను శిక్షించే విషయంలో రాజకీయాలకతీతంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి జిల్లాలో వన్ స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, అక్కడ బాధితులకు అవసరమైన కౌన్సిలింగ్, అవగాహన ఇప్పించడం జరుగుతుందన్నారు. ఇందుకూరుపేటలో జరిగిన ఘటనపై బాధితురాలు చెంచమ్మను అన్నివిధాల ఆదుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి తెలిపారన్నారు. సంఘటన జరిగిన వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించి మెరుగైన వైద్య సేవలు కోసం అపోలో ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. ఆమె అభివృద్ధికి అన్నివిధాల సహకరించడం జరుగుతుందని ఎమ్మెల్యే ప్రశాంతి తెలిపారన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులు సంధించిన పలు ప్రశ్నలకు ఆమె స్పందించి తగు సమాధానాలిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఏమి చూస్తూ మిన్నకుండిపోదని, నిందితులపై అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజనా, శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నెలాఖరులోగా రొట్టెల పండుగ ఏర్పాట్లు అన్ని పూర్తి చేస్తాం

## వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగ ఏర్పాట్లను ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి లోటుపాట్లను గుర్తించి వాటిని సరిదిద్దుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 30వ తేదీలోపు ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాలని, ముందుగా వచ్చే భక్తులకు సైతం ఎటువంటి అసౌకర్యం కలగకూడదని సూచించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. రొట్టెల పండుగ కోసం నిర్వహిస్తున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించామని, ప్రతి సంవత్సరం పండగ ఎంత బాగా నిర్వహించినా.. గత ఏడాదికి మించి నిర్వహించాలన్న తపన ఉంటుందని తెలిపారు. అధికారులు మారుతుంటారు కాబట్టి.. వారిని సమీక్షించి అవసరాలు తెలియజేస్తుంటామని, ఈనెల 30వ తేదీలోపు ఏర్పాట్లు అన్ని పూర్తి చేస్తామని తెలిపారు. తాను, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేస్తామని తెలిపారు. వందలాది మంది నాయకులు, కార్యకర్తలు వాలంటీర్లుగా పని చేస్తున్నారని, మంచి కార్యానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవ చేస్తున్న వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. జోన్ల వారీగా ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని, అధికారులు జోన్ల వారీగా విడిపోయి పని చేస్తున్నారని తెలిపారు. నెల్లూరు రూరల్, నగర నియోజకవర్గాల కమిటీ సభ్యులను వాలంటీర్లను జోన్లవా రీగా విభజించి బాధ్యతలు అప్పజెప్తామని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటామని, కార్యక్రమాన్ని దిగ్విజయం చేస్తామని తెలిపారు. వారితో పాటు నగరపాలక సంస్థ అధికారులు, మైనారిటీ నాయకులు జాఫర్ షరీఫ్, సాబీర్ ఖాన్, షంషుద్దీన్, సమీ హుస్సేనీ, అస్లాం, రియాజ్, ఖాదర్ భాషా, మస్తాన్, 35 డివిజన్ టిడిపి అధ్యక్షుడు బర్నబాస్ తదితరులు పాల్గొన్నారు.

# పొదలకూరు లే-అవుట్‌లలో పబ్లిక్ ప్రాపర్టీ స్థలాలు భద్రమేనా ?

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు పట్టణంలో 1985లో ఏర్పాటు చేసిన లే అవుట్‌లోని సుమారు 4 కోట్ల రూపాయల విలువైన పబ్లిక్ ప్రాపర్టీ స్థలాన్ని అక్రమంగా అమ్మకాలు జరిపిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆ స్థలంపై స్థానికులు ప్రస్తుతం న్యాయ పోరాటం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. పొదలకూరు సమీపంలోని తోడేరు పంచాయతీలో పొలాలకు మంచి గిరాకీ ఏర్పడింది. తోడేరు పొలాలు నెల్లూరు రోడ్డుకిరువైపులా ఉండడంతో పాటు పొదలకూరులోని సంగం రోడ్డు వరకు వ్యాపించి ఉన్నాయి. తోడేరు పొలాలు పొదలకూరు టౌన్ వరకు విస్తరించి ఉండడంతో ఆ పొలాల్లో విస్తారంగా లే అవుట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రియల్టర్ల కన్ను ఆ పొలాలపై పడింది. పొదలకూరు నెల్లూరు రహదారిలో డాబా ఎదురుగా ఏర్పాటు చేసి ఉన్న ఓ లేఅవుట్‌లో సుమారు 2 ఎకరాల వరకు పబ్లిక్ ప్రాపర్టీ స్థలాన్ని పంచాయతీకి కేటాయించి ఉన్నారు. తాజాగా కోట్ల రూపాయల విలువైన ఈ స్థలం కబ్జా పాలవుతోంది. గడిచిన నాలుగు రోజులుగా కొందరు రియల్టర్లు ఆ స్థలంలో డోజర్లు పెట్టి చదును చేస్తున్నారు. పట్టపగలే పంచాయతీకి కేటాయించిన స్థలం అక్రమణల పాలవుతున్నా.. ఆ పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడం పలు అనువానాలకు తావిస్తోంది. గతంలో పొదలకూరులో పని చేసిన పంచాయతీ కార్యదర్శులు కూడా రియల్టర్ల అక్రమాలకు సహకరించి సస్పెన్షన్‌కు గురైన విషయం స్థానిక ప్రజలకు తెలిసిందే. తమ ఉద్యోగాలకు ముప్పు తెచ్చుకోకుండా లేఅవుట్‌లో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకొని పబ్లిక్ ప్రాపర్టీ స్థలాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా తోడేరు పంచాయతీలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా లే అవుట్‌ల నిర్మాణం జరుగుతున్నట్లు సమాచారం. వీటిపై కూడా అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## చిన్నారిని ఆదుకుంటాం : ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండలంలో కుడితిపాలెం గ్రామం కాకర్లదిబ్బలో చిత్రహింసలకు గురైన చెంచమ్మ అనే బాలికను వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నా రు. మంగళవారం నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందు తున్న చిన్నారిని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారి చెంచమ్మను దారుణంగా హింసించడం అమానుషమన్నారు. చెంచమ్మను చిత్రహింసలకు గురి చేసిన వారిపై చట్టపర చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరామన్నారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని స్పష్టం చేశారు. చికిత్స పొందుతున్న చిన్నారి కోలుకున్నాక ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో చేర్పించి బాగోగులు చూస్తామన్నారు. ఇందుకూరుపేట టీడీపీ అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ సుధాకర్‌రెడ్డి, కూకటి వెంకటేశ్వర్లు రెడ్డి, తిక్కవరపు సుధాకర్‌రెడ్డి, బొద్దుకూరు సుధాకర్ పాల్గొన్నారు.

## సీఐడీ కేసులో కాకాణికి 2 రోజుల పోలీస్ కస్టడీ..కోర్టు ఉత్తర్వులు

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి మట్టిని అక్రమంగా తరలించారని సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి, వైసీపీ నాయకులు కాకాణి గోవర్ధన్ రెడ్డిని విచారణ నిమిత్తం రెండు రోజులు.. ఈనెల 25, 26 తేదీలలో పోలీస్ కస్టడీకి తరలించాలని నెల్లూరు 2వ అదనపు మెజిస్ట్రేట్ ఎల్.శారదా రెడ్డి మంగళవారం ఉత్తర్వులు చేశారు. ప్రస్తుతం జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న కాకాణి గోవర్ధన్ రెడ్డిని బుధవారం ఉదయం 8 గంటలకు విచారణ కొరకు సెంట్రల్ జైలు నుంచి పోలీసు కస్టడీకి తీసుకోవాలని బాపట్ల డీఎస్పీ సిట్ అధికారిని న్యాయమూర్తి ఆదేశించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారి న్యాయవాది సమక్షంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డిని విచారించాలని న్యాయమూర్తి తన ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈనెల 26న గురువారం సాయంత్రం 5 గంటల తర్వాత కాకాణి గోవర్ధన్ రెడ్డిని వైద్య పరీక్షలు జరిపి మెడికల్ సర్టిఫికేట్‌తో కోర్టులో హాజరు పరచాలని న్యాయమూర్తి తన ఉత్తర్వులో పేర్కొన్నారు. విచారణ సమయంలో ఎటువంటి థర్డ్ డిగ్రీ కార్యక్రమాలు పోలీసులు చేయకూడదని న్యాయమూర్తి ఉత్తర్వులో పేర్కొన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సూర్యాస్తమయం ముందు, సూర్యాస్తమయం తర్వాత ఎటువంటి పరిస్థితుల్లో పోలీసులు విచారించకూడదని ఉత్తర్వులో పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. సర్వేపల్లి రిజర్వాయర్లో అక్రమంగా మట్టిని తరలించారన్న ఆరోపణలపై నమోదైన కేసులో రెండవ నిందితుడిగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రస్తుతం జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారని, ఆయనను స్వయంగా విచారించటానికి 7 రోజులు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని బాపట్ల డీఎస్పీ, సిట్ అధికారి నెల్లూరు రెండవ అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాకాణి గోవర్ధ న్‌రెడ్డిని వ్యక్తిగతంగా విచారించినప్పుడే సర్వేపల్లి రిజర్వాయర్ అక్రమ తవ్వకాలలో ఎంతమేర ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నష్టం జరిగిందన్న విషయం తెలుస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా కాకాణి గోవర్ధన్ రెడ్డి తరుపున వారి న్యాయవాది కౌంటర్ దాఖలు చేస్తూ.. పోలీసులు ఆరోపించినట్లుగా కేసులో ప్రాథమిక ఆధారాలు లేవని పేర్కొన్నారు. సిట్ అధికారి డిఎస్పీ దాఖలు చేసిన పిటిషన్‌ను గోవర్ధన్ రెడ్డి తరఫున దాఖ లు చేసిన కౌంటర్‌ను సమగ్రంగా పరిశీలించిన కోర్టు కాకాణి గోవర్ధన్ రెడ్డిని పోలీసు కస్టడీకి తరలిస్తూ.. పైమేర ఉత్తర్వులు చేశారు.

## నీటి సమస్యకు పరిష్కారం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో కొడవలూరు మండలంలోని రెడ్డిపాలెం, మానేగుంటపాడులో ప్రజలకు నీటి సమస్య పరిష్కారమైంది. ఈ పంచాయతీల్లో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె.. ఆయా గ్రామాల్లో కొత్త మోటార్లు ఏర్పాటు చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు గ్రామానికి వెళ్లి బోర్లకు మరమ్మతులు చేయించి కొత్త మోటార్లు ఏర్పాటు చేశారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# మధుర జ్ఞాపకాలతో ఉపాధ్యాయుల సన్మానం

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం ఘన సన్మానం చేయడం జరిగింది. ఆ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు అశోక్, మురళీకృష్ణ, సయిాంలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ మాట్లాడుతూ.. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు అందరూ ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో పనిచేసి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారని, వారు చేసిన సేవలను ఘనంగా కొనియాడారు. పాఠశాలలో సుదీర్ఘకాలం పనిచేసిన జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు అశోక్‌కు సన్మానం చేస్తున్న



సందర్భంలో విద్యార్థులు ఉద్వేగాన్ని ఆపుకోలేక, వారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖాధికారి జొన్నా సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయురాలు అరుణ, గ్రామానికి చెందిన రాజేంద్ర కుమార్, సుబ్బయ్య, ఉపాధ్యాయులు డీ.వీ.రమణయ్య, మల్లికార్జున స్వామి, పెంచలరావు, బాలాజీ, తిరుపాలు, రహీమ, శ్రీనివాసులు, సునీత తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు పేకాటరాయుళ్ళు అరెస్ట్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి గ్రామ శివార్లలోని పొలాల్లో మంగళవారం స్థానిక ఎస్ఐ షేక్ జిలానీ ఆధ్వర్యంలో పూకాటస్థావరంపై దాడులు నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్‌చేశారు. వారినుండి 20,500రూపాయల నగదును, రెండు సెల్‌ఫోన్‌లను స్వాదీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. మండలంలో పేకాట, ఇతర జూదాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాము జూదంపట్ల ప్రత్యేక నిఘా ఉంచామని జిలానీ పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్ళు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని సున్నం వారి చింతల గ్రామంలో మంగళవారం గ్రామస్తులు గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి పొంగళ్ళు పొంగించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగలికి సంబంధించిన సామాగ్రిని కొత్త బుట్టలో పెట్టుకొని రామాలయానికి చేరుకున్నారు. అక్కడినుంచి డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య గ్రామోత్సవంగా గ్రామ దేవత ఆలయానికి చేరుకున్నారు. ప్రదక్షిణల అనంతరం సామూహికంగా పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనం ఇచ్చారు.



## నేటి నుండి యధావిధిగా నీటి సరఫరా

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో సోమవారం సాయంకాలం వీచినా గాలుల వలన కావలి సమర్ స్టోరీ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగినాయి. విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగినందువలన కావలి పట్టణానికి సరఫరా చేస్తున్న మంచి నీరు సరఫరా ఆగిపోయిందని కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ తెలిపారు. అలాగే మంగళవారం యుద్ధ ప్రాతిపదిక పైన విద్యుత్ స్తంభాలను పునరుద్ధించి బుధవారం నుండి యధావిధిగా మున్సిపల్ నీరు ప్రజలకి అందుబాటులోకి వస్తాయిని తెలిపారు.

# బీసీ కులగణన కల నెరవేరేనా..

- కార్యాచరణతో అడుగులు ముందుకు పడేనా..
- దశాబ్దాల నాటి బీసీల పోరాటానికి అడుగడుగునా జాప్యం
- హెూమ్ మంత్రి హామీ ఇచ్చినా ముందుకు పడని అడుగులు
- కులానికో కోడ్ ఇస్తే బాగుంటుందంటున్న విశ్లేషకులు

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** కులగణనపై దశాబ్దాల కాలం నుంచి బీసీలు చేస్తున్నఅలుపెరుగని పోరాటాలకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణన తోపాటు కులగణన చేస్తామని ప్రకటించింది. అయితే 2027లో జనగణన తోపాటు కులగణన చేపట్టడం జరుగుతుందని కేంద్రం అధికారికంగా షెడ్యూల్ విడుదల చేయడాన్ని బీసీ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనగణన తోపాటు కులగణన చేపట్టే విషయంలో కేంద్రంఉద్దేశ్యపూర్వకంగా ఆలస్యం చేస్తుందని. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో ఇదొక రహస్య అజెండాగా సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్గదర్శకాలు రూపొందించడంలోనూ, సమగ్ర డేటా సేకరణలోనూ వెంటాడుతున్న వైఫల్యాలు, వృత్తిపరమైన నైపుణ్యం లేకపోవడం, ఇతరత్రా అడ్డంకులు వెరచి బీసీ కులగణన జాప్యమయ్యేందుకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కారణమవుతున్నాయని, దీనిని బట్టి చూస్తే అసలు బీసీ కులగణన కల నెరవేరేనా.. అన్న సందేహాలను విశ్లేక్లులు వెలుబుచ్చుతున్నారు. నియోజకవర్గాల ప్రక్రియ యాధృచ్ఛికం కాకపోయినప్పటికీ 2026లో ప్రారంభం కావాల్సిన జనగణ తోపాటు కులగణన చేపట్టే ప్రక్రియలు 2027వరకు వాయిదాపడే అవకాశం ఉండటం ఆందోళన కలిగిస్తుంది. బీసీ కులగణనను 2027లో కాకుండా 2026 లోనే చేపట్టి చట్టసవరణ చేసినట్లయితే బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత కెంద్రప్రభుత్వానికి దక్కుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. 2026 అక్టోబరు 1 నుంచి జమ్ము, కాశ్మీర్, లడక్, ఉత్తరఖాండ్, హేమాచల ప్రదేశ్‌లో తొలివిడత బీసీ కులగణనను ప్రారంభించిన మీదట 2027 మార్చి 1 నుంచి రెండవ దశలో దేశమంతటా బీసీ కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా చేయడం వల్ల నియోజకవర్గాల పునర్విభజకు ఎంతగానో దోహదపడే అవకాశాలు ఉన్నప్పటికీ జనాభా నియంత్రణ విధానాలను ఖచ్చితంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు డీ-లిమిటేషన్ ప్రక్రియ వల్ల పార్లమెంట్ సీట్లు కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి రావడం బాధాకరమనే అభిప్రాయాలు పరిశీలకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. జనాభా నియంత్రణను గురించి ఏమాత్రం పట్టించుకోని పలురాష్ట్రాలు అదనపు సీట్లను బహుమతిగా పొందడం ఎతంవరకు సబబు.? ఇది ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీసే ప్రక్రియకాక మరేమిటి.? అన్న అంశాలపై బీసీ సంఘాల్లో సర్వత్రా చర్చలు సాగుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా డీ-లిమిటేషన్ విధానాన్ని రూపొందించాలనే విషయంపై సాక్ష్యాత్ కేంద్ర హెూమ్‌శాఖ మంత్రి అమిల్షా హామీ ఇచ్చినప్పటికీ.. స్పష్టమైన విధానం అవసరత కార్యాచరణలో కూడా స్పష్టత రావాల్సి ఉందనే అభిప్రాయాలు బీసీ కులబాంధవులు, సంఘాల నాయకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇదే క్రమంలో కులగణనలో సాంకేతిక పదాలు ఉపయోగించాల్సిన అవసరం లేకపోయినప్పటికీ.. కులం అనే పదాన్ని స్పష్టంగా చేర్చాల్సిన అవసరం ఉందని, ఇలాంటి చర్యల వల్ల బీసీలకు సామాజిక న్యాయం, రిజర్వేషన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల కేటాయింపుల్లో కుల అథారిత డేటాకు చట్టపరమైన విశ్వసనీయతను తీసుకొచ్చే అవకాశం ఉంటుందని జాతీయ బీసీ దళ్ నాయకులు సైతం అభిప్రాయాలను వెలుబుచ్చుతున్నారు.

### వెంటాడుతున్న వృత్తి నైపుణ్య లోపం

గతంలో కాంగ్రెస్ సోషియో, ఎకనామిక్ ద్వారా కులగణన చేపట్టినప్పుడు పట్టణ ప్రాంతాల్లో అర్బన్ డెవలప్మెంట్, గ్రామీణ ప్రాంతాల్లో రూరల్ డెవలప్మెంట్ శాఖల ఆధ్వర్యాల్లో కార్యాచరణ అమలు జరిగేవి. ఈక్రమంలో ఆయా శాఖల ఉద్యోగులకు వృత్తిపరమైన నైపుణ్యత లేకపోవడంతో డె -టా మొత్తం తప్పులు తడకగా మారిందనే అపవాదును మూటగట్టుకుంది. గణనలో ప్రతి కులానికి సంబంధించి ఓ కోడ్ నెంబర్ ఇవ్వడం వల్ల కులాలు కలిసిపోయి డేటా స్వచ్ఛత దెబ్బతినకుండా కాపాడుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రాలవారిగా కులాల జాబితాను తయారు చేసి వాటికి కోడ్ నెంబరు కేటాయింపుతో పత్రిక ప్రకటన ద్వారా తెలియడం మంచి ఆలోచన. కులగణన ద్వారా సేకరించిన డేటా ఆధారంగా బీసీలకు విద్య,వైద్యం, ఉద్యోగం, ఉపాధి. రాజకీయ రిజర్వేషన్లను దామాషా ప్రకారం పెంచాలి. ఇలా చేయడం వల్ల నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. జనగణన తోపాటు కులగణన చేపట్టే ప్రక్రియల్లో స్థానిక బాషలు, సామాజిక సమూహాల సమాచారాన్ని సక్రమరీతిలో నమోదు చేయడానికి సమగ్రమైన మార్గదర్శకాలను రూపొందించాల్సి ఉన్నప్పటికీ వెంటాడుతున్న వృత్తి నైపుణ్య లోపం వల్ల వెనుకంజలో ఉన్నట్లు తెలుస్తోంది. సెన్సెస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరిగే కులగణనపైమేధావులతో చర్చించిన మీదట సమగ్ర విదానాలు రూపొందించి, డేట్టా సేకరణలో సరైన చర్యలు. గోప్యతాపరమైన ఆందోళనలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. శిక్షణ పొందిన సెన్సెస్ డిపార్ట్మెంట్ అధికారుల ద్వారా కులగణన జరిగితేనే.. ఆ ప్రక్రియకు విశ్వసనీయత ఏర్పతుందనే అభిప్రాయాలు విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

## ఖచ్చితమైన గణాంకాలు ఉండాలి..

**సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య**



మనదేశ రాజకీయ అభివృద్ధి ప్రక్రియలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలంటే జనాభా, సామాజిక స్థితిగతులపై ఖచ్చిమైన గణాంకాలు తప్పనిసరి అన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నడుచుకోవాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గాల ప్రక్రియ యాధృచ్ఛికం.

## కులగణన త్వరితగతిన చేపట్టాలి

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు**



తెలంగాణా తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా కులగణన త్వరితగతిన చేపట్టాలి. ఆ తర్వాతనే లోకల్ బాడీ ఎన్నికలు జరిపితే బాగుంటుంది. ఎన్నికల ముందే కులగణన జరపడం వల్ల పూర్తిస్థాయిలో డేటా అందుబాటులోకి వస్తుంది. కులగణన త్వరితగతిన పూర్తి చేయడం వల్ల అన్ని కులాల తొ పాటు బీసీల్లో కూడా విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలకు సంబందించిన తగిన ప్రాధాన్యత క్రమంతో కూడిన రిజర్వేషన్ల వర్తింపుతో నూతనోత్సాహం పెరుగుతుందని, తదుపరి ఎలక్షన్లను ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రశాంతంగా జరుపుకునే అవకాశం ఉంటుంది.

# లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



కావలి, మేజర్‌న్యూస్ : కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు కావలి టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు తెలుగుదేశం పార్టీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు మాట్లాడుతూ.. 33మంది లబ్ధిదారులకు 32,29,298 రూపాయలు చెప్పులు పంపిణీ చేయడం జరిగిందని, అత్యవసర వైద్య ఖర్చులు ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సల కోసం ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ, ప్రభుత్వాన్ని ఇస్తున్న సహాయని ద్వారా ఇప్పటివరకు నియోజకవర్గంలో 4,36,63,040 చెక్కులను లబ్ధిదారులకి అందజేయడం విశేషం అని తెలిపారు. అభివృద్ధి సంక్షేమ లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే మార్గదర్శకంలో టిడిపి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసిన నెల రోజుల్లోనే చెక్కులు అందజేయడం టిడిపి ప్రభుత్వం స్పందనకు నిదర్శనమని తెలిపారు. చెక్కుల పంపిణీలో రాష్ట్ర వ్యాప్తంగా రెండో స్థానంలో నిలిచిన ఎమ్మెల్యే కావ్య విశేష సహకారం అభినందనీయమని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి ప్రారంభానికి కావలి నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడుకి, ఎమ్మెల్యే కావ్యకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కావలి ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, బోగోలు మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరావు, చిలకపాటి వెంకటేశ్వర్లు, కావలి రూరల్ మండల టిడిపి అధ్యక్షులు రామకృష్ణ కండ్లకుంట మధుబాబు నాయుడు, పొట్లూరి శ్రీనివాసులు, హరీష్య బేగం బిజెపి నాయకులకు పుట్టుపోయిన బ్రహ్మానందం, మంద కిరణ్, జనసేన కావలి పట్టణ అధ్యక్షులు సాయి విఠల్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ఎస్ఆర్‌కె ఫౌండేషన్ సేవలు



కొండాపురం, మేజర్‌న్యూస్ : మండలంలోని ఎస్ఆర్‌కె ఫౌండేషన్ సామాజిక సేవా రంగం, విద్యాభివృద్ధికి ఎనలేని సేవలు అందిస్తోంది. ఫౌండేషన్ తరపున చైర్మన్ గద్దె రామకృష్ణ యాదవ్ ఇటీవల జరిగిన మెట్ట ప్రాంత ఆరాధ్య దైవం శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలలో అన్నదానానికి గాను రూ.25వేలు వితరణ చేశారు. లింగన్నపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గతవారం విద్యా సామాగ్రి అందజేశారు. సోమవారం మండలంలోని సత్యవోలు అగ్రహారం పాఠశాలలో విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు తదితర విద్యా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భీమేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ గోగుల రవళి, వైస్ చైర్మన్ బొట్ట ప్రవీణ్, అంగన్వాడీ టీచర్ దాక్షాయణి పాల్గొన్నారు. ఫౌండేషన్ సేవలను విద్యా కమిటీ చైర్మన్ కొనియాడారు. సేవారంగంలో దూసుకుపోతున్న ఫౌండేషన్ చైర్మన్ రామకృష్ణను పలువురు గ్రామస్తులు అభినందించారు. ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతపరచాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థులు తరపున హెచ్ఎం భీమేశ్వరరావు ఫౌండేషన్ చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## పాలిటెక్నికల్ మొదటి సంవత్సరం ఫలితాల్లో..

# డీబీఎస్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు



కావలి, మేజర్‌న్యూస్ : కావలి పట్టణంలో చని విముద్దురుపాడులో స్థాపించిన ద్వితీయ సంవత్సరంలోనే డిబిఎస్ పాలిటెక్నిక్ కళాశాల ఉత్తమ ఫలితాలను సాధించడం పట్ల డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దాంశెట్టి సుధీర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలకు అనుబంధంగా 2022లో డిబిఎస్ పాలిటెక్నిక్ కళాశాలను స్థాపించడం జరిగిందని, అలాగే మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలవగా ఈ ఫలితాల్లో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు అద్భుతంగా తమ ప్రతిభను కనబరిచారు. విభాగాలపరంగా నుండి 8.75 జీపీఏతో ఎం.అజయ్ కుమార్ అనే విద్యార్థి విజయం సాధించగా సీఈసీ విభాగం నుండి 9.57 జిపిఏతో సీఈసీ విభాగం బి.చేతన్ కుమార్ అనే విద్యార్థి మొదటి స్థానం సంపాదించుకున్నారు. ఫణి కుమార్ 9.55 సిపిఎంతో ద్వితీయ స్థానంలోనూ కే.తరుణ్ కుమార్ 9.38 జిపిఏలో తృతీయ స్థానంలోనూ సి.ఎస్సి విభాగం నుండి 8.55 జీపీఏతో ఏ.సుమన్ అనే విద్యార్థి ప్రథమ స్థానంలో తన సత్తానునిరూపించారు. మంచి ఫలితాలు కళాశాల సాధించి పెట్టిన ప్రతి విద్యార్థిని, విద్యార్థులకు అభినందనలు తెలిపి వారి ఘనంగా సత్కరించారు. కళాశాల విద్యార్థులకు కూడా నూరు శాతం ఉద్యోగ కల్పన ధ్యేయంగా పనిచేస్తున్న పని చేస్తూ వారికి ద్వితీయ సంవత్సరం నుండి ఉద్యోగ శిక్షణ కార్యక్రమంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రావు కళాశాల పరిపాలన అధికారి జి.రమేష్ బాబు పరీక్ష విభాగాధిపతి కిషోర్, ఇతర విభాగాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాగపూర్‌లో నాగరత్నమ్మ



వింజమూరు, మేజర్‌న్యూస్ : మహారాష్ట్ర లోని నాగపూర్ నందు మతిస్థిమితం లేని నాగరత్నమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు అక్కడ పోలీసులు వింజమూరు పోలీసులకు సమాచారం అందించారు. వింజమూరు ఎస్ఐ వీర ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు మతి స్థిమితం లేని నాగరత్నమ్మ తమ గ్రామం వింజమూరు బీసీ కాలనీ అని నా భర్త సుబ్బారావు అని అక్కడ పోలీసులకు తెలపడంతో వారు వింజమూరు పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించారన్నారు.. ఈ మేరకు ఆమెను గుర్తుపట్టిన వారు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి పూర్తి సమాచారం అందించగలరనిఎస్ఐ వీర ప్రతాప్ కోరారు. ఆమె గురించి సమాచారం సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమాచారం కోసం ఎస్ఐ ఫోన్ నెంబర్ 9440796375ను సంప్రదించాలని తెలిపారు.

## ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు



వింజమూరు, మేజర్‌న్యూస్ : వింజమూరు మండలం ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్రిబుల్ ఐటీలో సీట్లను సాధించి, ఎన్ఎంఎంఎస్‌లో ప్రతిభను చాటి పాఠశాల పేరును నిలిపారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకారావు తెలిపారు. సాయితేజ నూజివీడు షణ్ముఖ ప్రియా ఆర్కే వ్యాలీ మధుప్రియ ఒంగోలు ట్రిబుల్ ఐటీ పాఠశాలలో సీట్లు సాధించారని ఆయన తెలిపారు. అదేవిధంగా మరో అయిదుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికై తమ ప్రతిభను చాటారని తెలిపారు. ఈ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. మా పాఠశాల విద్యార్థులు ఇదేవిధంగా భవిష్యత్తులో కూడా విజయ పరంపరను కొనసాగిస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తూ ఉన్నత స్థానాలను అధిగమించేందుకు కృషి చేస్తామని అందుకు మా ఉపాధ్యాయ బృందం ప్రోత్సాహం పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు.

## మునగాకుతో పౌష్టిక ఆహార లోపాన్ని అధిగ మించవచ్చు : ఎం.మాలకొండారెడ్డి



వింజమూరు, మేజర్‌న్యూస్ : కష్ట జీవులు, నిరుపేదలు మునగాకును భుజించడం ద్వారా పౌష్టిక ఆహారలోపాన్ని అధిగమించి ఆరోగ్యంగా జీవిస్తారని ప్రముఖ సామాజిక వేత్త ఎం.మాలకొండారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునగాకును ఆహారంలో అధికంగా తీసుకోవడం ద్వారా మధుమేహం, కీళ్ల నొప్పులు, గుండె ఆరోగ్యం, రక్తపోటు, కాలేయం దెబ్బతినడం, కడుపు పుతాలు, కేన్సర్ అతిసారం వంటి రోగాలను నియంత్రించవచ్చు అని తెలిపారు. మునగాకులో విటమిన్ లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పేద ప్రజలు, కష్ట జీవులు ఈ ఔషధ గుణాలు కలిగిన మునగాకును ఆహారంలో అధికంగా తీసుకోవడం ద్వారా పౌష్టిక ఆహారలోపాన్ని అధిగమించి ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. మునగకాయలు, మునగాకును ఎక్కువగా ఉపయోగించుకోవాలని కోరారు. కంటిపై మునగాకును ఎక్కువగా తీసుకోవాలని కోరారు.

## ట్రిబుల్ ఐటీలో సీట్లను సాధించిన విద్యార్థులు

వింజమూరు, మేజర్‌న్యూస్ : వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్రిబుల్ ఐటీలో అత్యధిక సీట్లు సాధించి పాఠశాల పేరును నిలిపారని ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మాలకొండయ్య తెలిపారు రాష్ట్రంలోని వివిధ ట్రిబుల్ ఐటీ కళాశాలలో తమ విద్యార్థులు సీట్లనుసాధించి పాఠశాల పేరును సార్థకం చేశారన్నారు జి జ్ఞాపిక ఎస్‌కే అఫ్జల్ లీలా హిమజఎస్ రమ్యలత, వి.వేదిక్‌లు నూజివీడు ట్రిబుల్ ఐటీ కళాశాల నందు ఎస్‌కె.నహీం బి.నందిని చిత్ర శ్రీ ఆర్కే వ్యాలీ వై.యశ్వంత్ ఎన్.సాధిక్ ఎస్‌కే.హాస్య, ఒంగోలు కె.అజయ్ శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఆయనతో కలిసి ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను పలు పోటీ పరీక్షలకు ప్రారంభం నుంచే తర్ఫీదు అందిస్తూ వారికి ప్రోత్సాహం అందిస్తున్న ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# దేవరపాలెం, కొండ్లపూడి గ్రామాలలో పొలం పిలుస్తుంది







**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం లోని దేవరపాలెం, కొండ్లపూడి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్‌వి నాగమోహన్, సహాయ వ్యవసాయ సంచాలకులు నందం శ్రీనివాసులు, ఏఈఓ బానోతు శ్రీనివాసులు, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వరిలో ఆకు ముడత పురుగు, మైట్ తెగులు ఉందని తెలియజేశారు. అధికారులు సమాధానం ఇస్తూ.. మైట్ నివారణకు ఒక లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్లు ప్రోఫనో ఫాస్ కానీ ఒక లీటర్ నీటికి రెండు ఎంఎల్‌లు ఒబెరాన్ కానీ పిచికారి చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. అలాగే ఆకు ముడత తెగులుకు ఒక లీటర్ నీటికి రెండు గ్రాములు అసిపేట్ కానీ ఒక లీటర్ నీటికి 2 ఎంఎల్ మోనోక్రోటోపస్ కానీ రుచిగా చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. అదేవిధంగా నెల్లూరు రూరల్ మండలంలో రైతులు యూరియా కావాలని తెలియజేశారు. వారికి రైతు సేవా కేంద్రం ద్వారా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ సచివాలయ అధికారులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగ ఆశియాలే మా లక్ష్యం

### మందకృష్ణ మాదిగ పోరాటాలతోనే వర్గీకరణ లిభించింది




**జలదంకి, మేజర్‌న్యూస్ :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు జాతీయ నాయకుడు మంద కృష్ణ మాదిగ పోరాటాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి జాతీయ నాయకులు, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జ్ మంద వెంకటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. మంగళవారం జలదంకి మండలంలోని ఎల్ఆర్ అగ్రహారం పంచాయతీ పరిధిలోని తాబేటి వారి పాలెం గ్రామంలో సర్పంచ్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళ తిరుమల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మార్పీఎస్, ఎమ్మెఎస్‌పి నేతలు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెఎస్‌పి సంస్థాగత నిర్మాణం, ఆవిర్భవ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 31వ ఆవిర్భవ దినోత్సవం వేడుకల్లో భాగంగా ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంద వెంకటేశ్వరరావు మాట్లాడుత.. 30 సంవత్సరాల కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో మాదిగల గుర్తింపుకు, మాదిగల రిజర్వేషన్ కోసం పోరాడిన మహా నాయకుడు మందకృష్ణ మాదిగ అని తెలిపారు. ఆయన మాదిగల అభ్యున్నతి కోసం వారి రిజర్వేషన్ల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడి మాదిగల ఏబిసిడి వర్గీకరణ తెచ్చి పెట్టారన్నారు. అటువంటి మహా నాయకుడికి తెలుగు రెండు రాష్ట్రాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నేతలు పాదాభివందనం చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెఎస్‌పి కమిటీలను ఈ ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇంకా కొన్ని గ్రామాల్లో అంటరానితనం, అస్పృశ్యత, లాంటి కారణాలను మాదిగలు ఎదుర్కొంటున్నారని వాటిని కూడా అందరూ అనే సమానమే లక్ష్యంగా ఆడుతున్నామని తెలిపారు. నెల్లూరు జిల్లాతోపాటు జలదంకి మండలంలో, ఎంఎస్పి నాయకులు అత్యంత ఉత్సాహంగాతమ కమిటీల ఏర్పాటుకు ఉత్సాహంగా పని చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెఎస్‌పి జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్, ఎమ్మెస్‌వి రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంక టేశ్వర్లు, ఎంఎస్పి మహిళా ఇన్‌చార్జ్ గేరా జానకి మాల, ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజర్ల తిరుపాలు, చేకూరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ అగ్రహారంలో చోరీ



### పది సవర్ల బంగారం, 90వేల నగదు అపహరణ

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలంలోని ఎల్ఆర్ అగ్రహారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు గ్రామానికి చెందిన మోర్ల సీనయ్య, రవణమ్మ దంపతుల ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో దుండగులు బీరువాను పగలగొట్టి అందులో ఉన్న పది సవర్ల బంగారం, రూ. 90వేలు నగదును దోచుకెళ్ళారు. మోర్ల సీనయ్య, రవణమ్మ దంపతులు సోమవారం ఉదయం అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు అన్నవరంకు వెళ్లారు. క్రమం ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం ఇంటి బయట చిమ్మేందుకు పనిమనిషి రావడంతో తలుపులు తెరిచి ఉండడం గమనించింది దీంతో విషయాన్ని మోర్ల సీనయ్య అల్లుడు, కూతురు లు కావలిలో నివాసం ఉంటుండడంతో వారికి విషయాన్ని తెలిపారు. మోర్ల సీనయ్య అల్లుడు, ఉప్పాల దామోదర్, కూతురు సింధువులు ఎల్ఆర్ అగ్రహారం గ్రామానికి వచ్చి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు ఈ విషయాన్ని జలదంకి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ లతీఫున్నిషా తన సిబ్బందితో ఎల్ఆర్ అగ్రహారం గ్రామానికి వచ్చి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. అనంతరం నెల్లూరు నుండి క్లూస్ టీంను పిలిపించారు. చోరీ ఘటనపై వివరాలు నమోదు చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అప్పసముద్రం, నేలటూరులో పొలం పిలుస్తుంది




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని అప్పసముద్రం, నేలటూరు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి విజయ భాస్కర్ మాట్లాడుతూ.. రైతులు పంటల సాగులో పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించుకోవాలన్నారు. పంట మార్పిడి విధానం పాటించాలన్నారు. అనంతరం మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ చర్యలపై వివరించారు. ఖరీఫ్ సీజన్లో పచ్చిరొట్ట విత్తనాలు భూమిలో చల్లి పూత దశలో భూమిలో కలియదున్నాలన్నారు. ఫలితంగా భూమికి సేంద్రీయ ఎరువు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వినోద్, విఏఏల స్రవంతి, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

## రంగనాయకుల స్వామి గుడి ప్రతిష్టను కాపాడండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని పురాతన రంగ నాయక స్వామి ఆలయ ప్రతిష్టను కాపాడాలని మంగళవారం ఉదయ గిరికి విచ్చేసిన అమరావతి సర్కిల్ పురావస్తు శాఖ సూపరింటెంట్ ఇన్స్పెక్టర్ డాక్టర్ డిఎన్ బోయి, డిప్యూటీ సూపర్నెంట్ సాంబశివకుమార్, ఏఈ ప్రవీణ్ కుమార్, ఒంగోలు పురావస్తు శాఖ అధికారి యశ్వంత్ రెడ్డి లకు స్థానిక విశ్వహిందూ పరిషత్, పట్టణ దేవాలయాల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో విన్నవించారు. ఈ సందర్భంగా ఆ శాఖ అధికారులు ఆలయాన్ని అక్కడికి కట్టడాలను పరిశీలించారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వారి దృష్టికి తెచ్చారు. వాటిపై దృష్టి సాధించి ఆలయ ప్రతిష్ట ను కాపాడాలని కోరారు. అలాగే గుడిలో పునః ప్రతిష్ట జరిగేలా సహకరించాలని విన్నవించారు.

## రేషన్ డీలర్లతో తహసిల్దార్ సమావేశం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని రేషన్ డీలర్లతో తహసిల్దార్ కార్యాలయం మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ.. జూలై మాసంకు సంబంధించి రేషన్ పంపిణీని సజావుగా నిర్వహించవలసినదిగా డీలర్లకు సూచించారు. 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు దివ్యాంగులు మంచానికే పరితమైన వ్యాధి గ్రస్తులకు జూలై నెలకు సంబంధించిన రేషన్ ను ఈ నెల 26 నుంచి 30వ తేది వరకు వారి ఇంటి వద్దకే వెళ్లి డీలర్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినందున అందరు డీలర్లు సదరు ఆదేశాలను తప్పక పాటించాలని తెలిపారు. జులై మాసం 1వ తేదీ నుండి జరుగు నిత్యావసర సరుకులు పంపిణీ ప్రతి ఒక్క రేషన్ డీలర్ ప్రభుత్వం నిర్దేశించిన సమయం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4గంటల నుండి రాత్రి 8గంటల వరకు పంపిణీ చేయాలని, అదేవిధంగా గ్రామ రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకుల పంపిణీని నిత్యం పర్యవేక్షించ వలసి యున్నదని తహసీల్దార్ సానా శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దారు విజయమ్మ, డిప్యూటీ తహశీల్దారు భరత్, కార్యాలయపు సిబ్బంది గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలల్లోనూ ఉచిత ప్రవేశాలు కల్పించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని ప్రైవేట్ అన్నయ్య డేట్ పాఠశాల యజమాన్యాలు 12 (1)సి ప్రకారం ఒకటవ తరగతి అంతకంటే ఎగువ తరగతుల్లో చేరే విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు తప్పనిసరిగా కల్పించాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కరస్పాండరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత ప్రవేశం కల్పించిన విద్యార్థులకు ప్రభుత్వం వారి ఖర్చు భరించి ఫీజు రేయింబర్స్మెంట్ నవదును ఖాతాలో జమ చేస్తుంది. అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలు పనిచేయాలన్నారు. పాఠశాలలో విద్యా అర్హతలు ఉన్న వారిని నియమించుకోవాలన్నారు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చి తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు శివప్రసాద్ సుధాకర్ భాస్కర్ రెడ్డి సుదర్శన్ మహబూబ్బాషా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆరోపణలు హాస్యాస్పదం



## బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలను బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ ఖండించారు. ఆమె ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, హాస్యాస్పదంగా ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. 'బీజేపీ ఎవరికీ ఊడిగం చేయదు. మేము దేశ ప్రయోజనాల కోసమే పని చేస్తాం. గతంలో కాంగ్రెస్ అనేక అపవిత్ర పొత్తులు పెట్టుకుంది' అని ఆయన విమర్శించారు. పోలవరం, ప్రత్యేక హోదా విషయంలో బీజేపీ చిత్తశుద్ధితో ఉందని, విభజన హామీలను నెరవేర్చేందుకు కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను విభజించి రాష్ట్రానికి నష్టం చేసిన పార్టీ కాంగ్రెస్‌యేనని గుర్తు చేశారు. ఆ తప్పుల బాధ్యతను బీజేపీపై నెట్టాలని షర్మిల ప్రయత్నించడం తగదన్నారు. 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటే కేంద్ర-రాష్ట్రాలు కలసి అభివృద్ధి కోసం పని చేయడం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది,' అని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలుకు సమయం పట్టే విషయాన్ని గుర్తుచేస్తూ, 'మీ పార్టీ బలోపేతం కావాలని బీజేపీపై నిరాధార ఆరోపణలు చేయడం తగదు,' అని స్పష్టం చేశారు. బీజేపీ దేశాభివృద్ధి పథంలో నడుస్తోందని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలిపారు.

# రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ





**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రామతీర్థం ఆలయాన్ని ధార్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలం శ్రీకామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొనేందుకు రామతీర్థం గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుని ఆమె ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతుల కళ్యాణోత్సవం సందర్భంగా స్వామి అమ్మవార్లకు ఆమె చీర సారే సమర్పించారు. అనంతరం కన్నుల పండుగగా సాగిన శివపార్వతుల కళ్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. రామతీర్థంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. సరిగ్గా ఏడాది క్రితం రామతీర్థం నుంచి తన ఎన్నికల ప్రచారం ప్రారంభించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఆధ్యాత్మిక వేడుకలు మన సంస్కృతి సాంప్రదాయాల గొప్పతనాన్ని చాటి చెబుతాయన్నారు. శ్రీ కామాక్షి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్వతీ పరమేశ్వరుల ఆశీస్సులతో రామతీర్థం ప్రాంతంతోపాటు కోవూరు నియోజకవర్గం పరిశ్రమలు, పాడి పంటలతో సుభిక్షంగా వుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సురేష్ విడవలూరు మండల టిడిపి అధ్యక్షులు శ్రీహరి రెడ్డి టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి అడపాల శ్రీధర్ రెడ్డి, పూండ్ల అచ్యుత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# సాగునీటి ఆక్రమణలను పరిశీలించిన అధికారులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** లోకాయుక్త ఆదేశాలతో మంగళవారం ఆత్మకూరు చెరువుక్రింద సాగునీటి కాలువల ఆక్రమణలపై అధికారులు పరిశీలన జరిపారు. ఈ కాలువలవద్ద ఆక్రమణలు జరిగాయంటూ స్థానికులు కొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దాంతో నీటిపారుదలశాఖ చీఫ్‌ఇంజనీర్ వరప్రసాద్, సూపర్నెంట్ ఇంజనీర్ దేశ్‌నాయక్, ఆత్మకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి, స్థానిక తహశీల్దారు పి.పద్మజా కుమారి, ఇరిగేషన్ రవికుమార్‌రెడ్డి, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఎస్.కొండయ్య తదితరులు ఆక్రమణలను గురించి పరిశీలించారు. సాగునీటి కాలువలు ఆక్రమణకు గురయ్యాయని లోకాయుక్తకు కొందరు ఫిర్యాదుచేయగా వారి ఆదేశాలమేరకు తాము పరిశీలించామన్నారు. ఈ వివరాలను తాము లోకాయుక్తకు నివేదిస్తామని సిఈ వరప్రసాద్ పేర్కొన్నారు.

# సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్ !

(మొదటి పేజీ తరువాయి)



ట్రబుల్ ఇంజన్ అని, సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అన్నారు. సూపర్ సిక్స్ అంతా మోసమేనన్నారు. ప్రతి రైతుకి 20 వేలు ఇస్తా అని ఇంత వరకు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 85 లక్షల మంది రైతులు ఉంటే 45 లక్షల మందికి ఇస్తున్నామని చెప్తున్నారని, తల్లికి వందనం కింద బిడ్డలను మోసం చేస్తున్నారన్నారు. 87 లక్షల మంది పిల్లలు ఉంటే.. 67 లక్షల మందికి ఇచ్చారన్నారు. 20 లక్షల మంది బిడ్డలకు ఎగ్గొట్టారన్నారు. నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. మహిళలకు మహిళా శక్తి ఇక లేదని, ఈ పథకాన్ని పీ4 పథకానికి లింక్ పెట్టారన్నారు. ఎన్నికల ముందు పీ4కి లింక్ పెడతామని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఒక్కో మహిళలకు 18 వేలు ఇస్తామని 2 కోట్ల మంది మహిళలను మోసం చేశారన్నారు. గ్యాస్ ఒక్కటి అరకొర ఇచ్చి గొప్పలు చేస్తున్నారని, మహిళలకు ఉచిత బస్సు ఊసే లేదన్నారు. కర్ణా టక, తెలంగాణలో గొప్పగా ఉచిత బస్సు అమలు అవుతుందన్నారు. మహిళలకు భద్రత కల్పించాలని సోయి కూడా లేదని, పండుగలు పబ్బాలు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. జాబ్ క్యాలెండర్ లేదు.. ఒక్కరికి ఉద్యోగాలు లేవన్నారు. ఫీజు రీయింబర్స్ బకాయిలు రాష్ట్రంలో 4700 కోట్లు ఉన్నాయని, ఆరోగ్య శ్రీ బకాయిలు 4వేల కోట్లు ఉన్నాయ న్నారు. ఏడాదిలో 15 వేల కోట్ల విద్యుత్ భారం వేశారని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 47 ఏళ్లకే పెన్షన్ అని మోసం చేశారని, ఇదేనా సుపరిపాలన అని ప్రశ్నించారు. నాలుక మందం ఎవరికి అని, గుండెల మీద చెయ్యి వేసుకొని చెప్పండన్నారు. ప్రశ్నించే మాకు కాదు నాలుక మందం.. హామీలు ఇచ్చి మోసం చేసిన మీకే నాలుక మందం వ్యంగ్యాస్త్రం వదిలారు. మానిఫెస్టో అంటే 5 ఏళ్ల పాలనకు అర్థమని, మీ ఇష్టం వచ్చినప్పుడు అమలు చేసేది కాదు మానిఫెస్టో అన్నారు. జగన్ పాలనలో మద్యం కుంభకోణం జరిగిందన్నారు. ఇప్పుడేమో ఓడిపోయాక ప్రజల మధ్యకు వస్తున్నారని, కేవలం ఉనికి కోసమేనన్నారు. జనం మరిచి పోతారని నానా తంటాలు పడుతున్నారన్నారు. కూటమి నిర్లక్ష్యం మీద పోరాటం చేసేది కాంగ్రెస్ మాత్రమే అన్నారు. ప్రతి నెల తాలి బజా వో చేస్తున్నామని, మా పోరాటాలకు ఆంక్షలు పెడుతుంటారన్నారు. దీక్ష లు చేస్తే భగ్నం చేస్తున్నారని, హౌజ్ అరెస్టులు చేస్తున్నారన్నారు. వైసీపీకి ఒక న్యాయం.. మాకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. జగన్‌కి దగ్గ రుండి బల ప్రదర్శనలు చేయిస్తున్నారని, కార్ల కింద, టైర్ల కింద జనాలను తొక్కే వాళ్లకు అన్ని అనుమతులు ఉంటాయి కానీ, ప్రశ్నించకుండా మా గొంతు మాత్రం నొక్కుతారన్నారు. మానవత్వం గురించి మాట్లాడే హక్కు జగన్ లేదని, నిర్లక్ష్యాన్ని ప్రశ్నించే హక్కు మాకుందన్నారు. జగన్ పోరా టాలు అసెంబ్లీ వేదికగా చేయాలని, బయట చేస్తూ అసెంబ్లీ వేదికగా కూడా పోరాటాలు చేయాలన్నారు. అసెంబ్లీకి పోయే దమ్ము లేక బయట మాట్లాడుతున్నారన్నారు. నాకు జగన్ మీద మాట్లాడటం అజెండా కాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో నాకు సూపర్ ఇమేజ్ అవసరం లేదని, నాకు రాజ్యాలు ఏలాలని లేదని, కాంగ్రెస్ బలోపేతం మా ఏకైక అజెండా అని పేర్కొ న్నారు. సమావేశంలో డిసిసి అధ్యక్షులు చేవూరు దేవకుమార్ రెడ్డి, నెల్లూరు సిటీ ఇంచార్జ్ నారపురెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సుధీర్, సంజయ్, జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాంస్కృతిక పోటీలను జయప్రదం చేయండి : ఆర్డీఓ



**కావలి, మేజర్‌న్యూస్ :** ప్రపంచ రక్తదాతల దినోత్సవాల సందర్భంగా కావలి రెడ్డి క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక పోటీలను జయప్రదం చేయాలని ఆర్డీఓ మరియు కావలి రెడ్ క్రాస్ అధ్యక్షులు ఎం.సన్నీ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం సాంస్కృతిక పోటీల కరపత్రాలను ఆర్డీఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. విద్యార్థులలో స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన పెంచేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో కావలి పట్టణం, పరిసర ప్రాంతాలలోని అన్నీ ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల నుండి ప్రాతినిధ్యం ఉండేలా ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలు శ్రద్ధ వహించాలని, పాల్గొన్న ప్రతీ విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వబడును అని తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డి.రవిప్రకాష్ పోటీల వివరాలను తెలుపుతూ, లలితసంగీతం, బృంద గానం, నృత్యం, గ్రూపు డాన్స్, చిత్రలేఖనం (పోస్టర్ డిజైన్), లఘు నాటిక (స్కిట్)లలో పోటీలు నిర్వహిస్తున్నామని, రక్తదానం ప్రాముఖ్యత అనే అంశం పైనే ప్రదర్శనలు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ యం హరిప్రసాద్, జిల్లా రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, కావలి శాఖ కోశాధికారి ఆరికట్ల మధుసూదన్ రావు, పాలక మండలి సభ్యులు డాక్టర్ పామూరు శ్రీధర్, గొట్టిపాటి మనోరమ, ఓరుగంటి వెంకటేశ్వర్లు, డాక్టర్ టి.రమ్య, కార్యదర్శి బియస్ ప్రసాద్, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ పై దాడి

### పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండల కేంద్రం ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీలో ఉద్యోగపరమైన దాడి జరిగింది. యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఏ.బాలసుబ్రమణియన్ పై మంగళవారం రీ ఎంప్లాయిమెంట్‌లో భాగంగా పనిచేస్తున్న ఎఫ్ఆర్ఎం (ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్మెంట్) డాక్టర్ డి.రామలింగయ్య మంగళవారం దాడి చేశారు. అసోసియేట్ డీన్ చాంబర్‌కి వెళ్లి అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. డీన్ తల పట్టుకొని పక్కకు వంచి చేతితో కొట్టారు. వెంటనే అక్కడ ఉన్న అధ్యాపకులు, విద్యార్థులు అడ్డు తగిలి డీన్ ఛాంబర్ నుంచి బయటికి తీసుకువచ్చారు. ఈ సంఘటనతో అసోసియేట్ డీన్ భయ భ్రాంతులకు గురైనారు. ఆయనను అసభ్య పదజాలంతో దూషించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీస్ శాఖ సిబ్బంది కళాశాలకు చేరుకొని దాడి చేసిన ఆర్‌పిఎంను తీసుకెళ్లారు. తదుపరి అసోసియేట్ డీన్ పోలీస్ అధికారులకు ఈ దాడిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది. దాడి వెనుక ఉన్న కారణాలు సమగ్రంగా తెలియజేశారు.

# స్కూల్ బస్ డ్రైవర్ నిర్లక్ష్యంతో తృటిలో తప్పిన ప్రమాదం




**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** ఓ ప్రయివేట్ స్కూల్ బస్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. హిమాలయ ప్రయివేట్ స్కూల్ బస్ మంగళవారం తోటపల్లి గూడూరు మండలం కోవెరపాలెం గ్రామంలో భీభత్సం సృష్టించింది. బస్సు కోవెరపాలెం గ్రామంలోని విద్యుత్ స్తంబాలకు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంబాలు నెలకొరి గాయి. సమాచారం అందుకొన్న విద్యుత్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. లేదంటే ప్రాణాపాయం సంభవించి వుండేదని గ్రామస్తులు చెబుతున్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు. చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడిన బస్సు డ్రైవర్ పై పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఏదేమైనా అదృష్ట వశాత్తు ఎటువంటి ప్రాణాపాయం సంభవించక పోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకొన్నారు.

# రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టే : పోర్ట్ సీఈఓ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టు అవుతుందని పోర్టు సీఈవో జగదీష్ పటేల్ అన్నారు. మంగళవారం అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. రక్తదాన శిబిరంలో 186 యూనిట్ల రక్తం సేకరించబడింది. ఉద్యోగులు, వ్యాపార సహచరులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది. అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ యొక్క కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం అయిన అదానీ ఫౌండేషన్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కలిసి ఒక రోజు రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రక్తదాతలకుఅదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్, అదానీ ఫౌండేషన్‌తో కలిసి ఈ శిబిరాన్ని నిర్వహించినందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో చాందిని పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నెల్లూరు /వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ... నెల్లూరు టౌన్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ అధీనంలో ఉన్న 33/11కేవీ తెలుగుగంగ సబ్ స్టేషన్ పరిధిలో రోడ్ వెడల్పు పనులు జరుగుతున్నందున హౌసింగ్ బోర్డు కాలనీ.. జడ్పి కాలనీ.. సంజయ్ గాంధీ నగర్.. ఇందిరాగాంధీనగర్.. పొదలకూరు రోడ్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయబడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మన్నేపల్లి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పును సహృదయులైన వినియోగదారులు గమనించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని.. అత్యవసర విభాగాల వారు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

## ఖాళీ స్థలాలకు పన్నులు లేకుంటే చర్యలు




**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక 18వ డివిజన్ హరనాధపురం ప్రాంతంలోని ఖాళీ స్థలాలకు హెచ్చరిక బోర్డులను రెవెన్యూ అధికారులు మంగళవారం ఏర్పాటు చేశారు. సంబంధిత ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులను విధించుకునేందుకు సరైన అధికారిక పత్రాలతో సంబంధిత వార్డు సచివాలయాన్ని సంప్రదించాలని యజమానులకు సూచించారు. ఖాళీ స్థలాలకు పన్నులు విధించుకోకుంటే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. అందుకు సంబంధించిన బోర్డును ఆ ప్రాంతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సమద్, ఆర్.ఐ రవి, సచివాలయ వార్డు అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## దళితుల స్మశాన స్థలం సమస్యను పరిష్కరించండి

### తహసిల్దార్‌కు చిరమణ విజ్ఞప్తి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పిడతా పోలూరు గ్రామపంచాయతీలో ఎల్‌పి నెంబర్ 102లో ఉన్నటువంటి దళితుల స్మశాన స్థలం వివాదాన్ని పరిష్కరించాలని స్థానికులు, హ్యూమన్ రైట్స్ నిర్వాహకులు చిరమన మోహన్‌రావు రెవెన్యూ శాఖ అధికారులను కోరారు. మంగళవారం ఆయన గ్రామస్తులతో కలసి తాసిల్దార్ స్వప్నకు వినతి పత్రం ఇచ్చారు. దశాబ్దాల కాలంగా వాడుకుంటున్న స్మశాన స్థలాన్ని కొంతమంది చదును చేస్తూ పనులు చేస్తున్నారని ఈ పనులు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే తాసిల్దారు స్పందించారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం సరుకులు పంపిణీ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి అంగనవాడి ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో జులై ఒకటో తేదీ నుంచి ముఖహాజరుతో కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పౌష్టిక ఆహారం, సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని సిడిపిఓ సునీత పేర్కొన్నారు. ఆమె మంగళ వారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ముఖ ఆధారిత గుర్తింపు యాప్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తమ కార్యకర్తలు లబ్ధిదారులకు సంబంధించిన ముఖహాజరును యాప్‌లో అప్లోడ్ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు లబ్ధిదారులు సహకరించాలన్నారు.

# ట్యాక్స్ రివిజన్ సర్వేను ఆదివారంలోపు పూర్తి చేయండి

## కమిషనర్ వైఓ నందన్




**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలో టాక్స్ రివిజన్ సర్వేకు అత్యంత ప్రాధాన్యత కల్పించి, ఈనెల 29వ తేదీ ఆదివారం నాటికి నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో సర్వేను పూర్తి చేయాలని కమిషనర్ వైఓ నందన్ రెవెన్యూ అధికారులు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. రెవెన్యూ సెక్షన్ వారాంతపు సమీక్షా సమావేశాన్ని కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన ఉత్తర్వుల మేరకు ప్రతి అడ్మిన్ కార్యదర్శి సచివాలయ ఇతర కార్యదర్శులను సమన్వయం చేసుకుని ఇంటింటి ట్యాక్స్ రివిజన్ సర్వేను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో ఉదయం 6 గంటల నుంచి రీ సర్వే ప్రారంభించి, గృహాలకు సంబంధించిన అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేయాలని, నివేదికలను గూగుల్ షీట్స్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. సచివాలయాల మేరకు నిర్దేశించిన సర్వే రివిజన్ లక్ష్యాలను అడ్మిన్ కార్యదర్శుల ద్వారా పూర్తి చేయించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించిన కమిషనర్

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నగర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో ప్రతిరోజు జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించాలని కమిషనర్ వై.ఓ నందన్ సిబ్బందిని ఆదేశించారు. చెత్త సేకరణ వాహనాలు ప్రతిరోజు ఎన్ని ట్రిప్పులు తిరుగుతున్నాయో దైనందిన నివేదిక ద్వారా తెలియజేయాలన్నారు. హెల్ప్ లైన్ నెంబర్ కు వస్తున్న సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం అందించేందుకు కృషి చేయాలని కమిషనర్ సూచించారు.

# సక్సెస్ వైపు.. కండలేరు రిజర్వాయర్ ప్రస్థానం



**సూర్య కథనాలు ప్రశంసనీయం : తెలుగుగంగ సూపరింటెండెంటింగ్ ఇంజనీరు ఎన్ రాధాకృష్ణారెడ్డి**

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఆకాంక్ష మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లో సాగు, త్రాగునీటి అవసరాలు తీర్చే అక్షయపాత్ర లాంటి కండలేరు రిజర్వాయర్ ప్రస్థానాన్ని సక్సెస్ బాట (విజయపథం) వైపు మరింత ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచనలేకుండా కృషి చేస్తామని తెలుగుగంగ సూపరింటెండెంటింగ్ ఇంజనీరు నర్ల రాధాకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మేజర్‌న్యూస్ మాట్లాడుతూ.. నేటి సమాజ ఆవశ్యకతలో వాస్తవిక పరిస్థితులను ఎప్పటికప్పుడు పారదర్శక కథనాల రూపంలో పాఠకుల ముందుకు తీసుకెళ్లడంలో తన వంతు కీలక భాగస్వామ్య పాత్ర పోషిస్తున్న నేటి దినపత్రిక సూర్యకి లభిస్తున్న విశేష ఆదరణ అనన్యసామాన్యమన్నారు. ప్రస్తుత నేపథ్యంలో స్వచ్ఛమైన జలాలను అందించే కల్పతరువు లాంటి కండలేరు రిజర్వాయర్లో 34.688 టిఎంసీల నీరు నిల్వ ఉండటం అదృష్టమన్నారు. ఇటీవల నిర్వహించిన ఐఏబీ తీర్మానం ప్రకారం కండలేరు పరీవాహక ప్రాంతాల్లో రెండవ పంట సాగుకు సన్నద్ధమవుతున్న ఆయకట్టు రైతన్నలకు కండలేరు జలాశయం నుంచి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు యాక్షన్ ప్లాన్‌తో షెడ్యూల్ అమలు జరిగిందని, గత ఏడాది వర్షాభావ పరిస్థితులు అనుకూలించడంతో నవంబరు, డిసెంబరు నెలలతో పాటు ఈ ఏడాది జనవరిలో వానలు కురిశాయని, ఐఏబీ నిర్ణయం ప్రకారం ఇదే ఏడాది మే నెల 5 నుంచి నీటి విడుదల ప్రక్రియ కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కండలేరు జలాశయం పరిధిలో 39,100 ఎకరాల భూమిని లోకలైజేషన్ (ఆయకట్టు కింద) చేర్చడం జరిగిందన్నారు. సర్వే నెంబర్ల వారిగా భూమి విస్తీర్ణం తాలూకు లోకలైజేషన్‌పై రైతులకు మరింత అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఒక ప్రత్యేక బుక్లెట్ సిద్ధం చేయించి, మండలస్థాయి రెవెన్యూ అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. నీటిపారుదలకు అవాంతరాలు ఉన్న కాలువలను గుర్తించి ఆధునీకరించే పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఐఏబీ సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, సాగునీటి సలహామండలి సభ్యులందరి ఆమోదంతో నిర్ణయించిన ప్రకారం 1.60 ఎకరాల ఆయకట్టుకు 16 టిఎంసీలు.. అదేవిధంగా త్రాగు అవసరాల నిమిత్తం 10 టిఎంసీల చొప్పున నీటిని నిల్వ ఉంచడం జరిగిందన్నారు.

# పేదలకు పక్కా గృహాల కోసమే బీజేపీ పోరాటం : బీజేపీ నేత మిడతల రమేష్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** వ్యక్తులు కోసం హౌసింగ్ కార్పొరేషన్ పై ఆరోపణలు చేస్తున్నామని అధికారులు చేస్తున్న ప్రచారాలను బీజేపీ నేత మిడతల రమేష్ ఖండించారు. రాష్ట్రంలో మోడీజీ హౌసింగ్ ఫండ్స్ లూటీ పై ఢిల్లీలోని కేంద్ర సంస్థల దృష్టికి నిధులు దుర్వినియోగం అంశాలను తెలియజేశారు. నెల్లూరు అర్బన్ లేఔట్లలో లూజ్ సాయిల్ ఫౌండేషన్‌లో బల్బు సిస్టం అమలు చేయడం లేదని 2022 మే 9వ తేదీన స్పందనలో ఫిర్యాదు ఇసుక భూమిలో నిర్మాణాలు పటిష్టం కాదని ఇతర శాఖల ఇంజనీర్ల చేత విచారణ జరిపించాలని 2022 మే 23న స్పందనలో ఫిర్యాదు చేసిన రసీదులను పొందుపరుస్తూ ఫిర్యాదు చేశారు. ఒకే లేఔట్‌లో నిర్మించిన గృహాలలో పగుళ్లను నాసిరకం నిర్మాణాల వలన నివాసానికి గృహాలుపనికిరావని హౌసింగ్ విజిలెన్స్ అధికారులు తాజాగా గుర్తించారు. అధికారులు కాసులకు కక్కుర్తి పడి ప్రాంతంలో నిర్మాణాలు చేసి భారీ స్థాయిలో నిధులు దూరం చేశారు. ఈ నిర్మాణాలు చేపట్టిన ఆ అధికారులపై పోలీసులకు క్రిమినల్ ఫిర్యాదులు చేయాలని వారి ఆస్తులపై ఆర్ఆర్ ఆక్ట్ ప్రకారం వసూలు చేసి గృహాలు నిర్మించాలని రమేష్ తన ఫిర్యాదులలో పేర్కొన్నారు. అవినీతిని ఆధారాలతో బిజెపి ఫిర్యాదు చేస్తుందని నా మీద ద్వేషంతో నాతో సాన్నిహిత్యం ఉన్న వ్యక్తినీ 4 కోట్లు ఆర్థికంగా దెబ్బతీశారు. రాష్ట్రంలో హౌసింగ్ శాఖ 9688 నిర్మాణ పనులు ప్రారంభించింది. అందులో 5240 పనులను విజిలెన్స్ తనిఖీ చేసింది. 1019 పనులకు మాత్రమే నివేదికలు సిద్ధం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ పనులలో నిధులు దుర్వినియోగం పై 650 మంది ఏఈ. డిఈ ఈఈలకు శోకాస్ నోటీసులు జారీ చేశారు. వారి నుండి రికవరీ లేదు. క్రిమినల్ చర్యలు లేవు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ అవినీతిపై జీవోల రూపంలో ఇచ్చిన మెమోలు పై కూడా రాష్ట్రంలో చర్యలు తీసుకోలేదు. హౌసింగ్‌లో కేంద్ర నిధుల దోపిడీలో అవినీతి అధికారులకు గత ప్రభుత్వం రక్షణ కవచంగా నిలిచింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన అవినీతి అధికారులను కాపాడే రక్షణ వ్యవస్థ మాత్రం కొనసాగుతోంది. ప్రధాని మోడీజీ పేదరిక నిర్మూలన అంత్యోదయ లక్ష్యసాధన కొరకు నాసిరకం నిర్మాణాల అంశాలను ఢిల్లీ అధికారుల దృష్టికి తీసుకువెళుతున్నామని రమేష్ తెలిపారు.

సూర్య

విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.


కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, అనంతసాగరం, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9000483583

# మూలస్థానేశ్వర దేవస్థానంలో మాస శివరాత్రి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం నందు మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం సాయంత్రం స్వామి వారికి విశేష పూజ నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను చిన్న రథంపై ఊరేగించారు. మాస శివరాత్రి అనేది ప్రతి నెలలో వచ్చే ఒక పవిత్రమైన రోజు, అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి తిథి రోజున శివుడిని పూజించే రోజు. ఈ రోజున ఉపవాసం ఉండి, శివలింగానికి అభిషేకం చేసి, శివనామస్మరణ చేయడం ద్వారా శివుని అనుగ్రహం పొందవచ్చని భక్తుల నమ్మకం. మాస శివరాత్రి శివునికి ఎంతో ప్రీతికరమైన రోజుగా భావిస్తారు. ఈ రోజున శివుడిని పూజించడం ద్వారా శుభ ఫలితాలు కలుగుతాయని నమ్ముతారు. కొంతమంది భక్తులు ఈ రోజున ఉపవాసం ఉండి, శివుడిని పూజించడం ద్వారా రాహు, కేతు వంటి గ్రహాల దోషాలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. మాస శివరాత్రి రోజున భక్తిశ్రద్ధలతో శివుడిని పూజిస్తే, కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్ముతారు. శివుని అనుగ్రహం ఉంటే ఆరోగ్యం, ఐశ్వర్యం లభిస్తాయని భక్తుల నమ్మకం.స్వామి అమ్మవార్లను దర్శించడానికి భక్తులు విశేషంగా తరలి వచ్చారు.

# ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థినులు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నాగలక్ష్మి తెలిపారు పాతల ధనలక్ష్మి పదవ తరగతిలో 592 మార్పులు సాధించి నూజివీడు ట్రిబుల్ ఐటీ పాఠశాలలో అలాగే చట్ట తనుశ్రీ 577 మార్కులతో ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం ఆ విద్యార్థులను అభినందించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మా పాఠశాల నుండి ప్రతి సంవత్సరము ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధిస్తున్న విద్యార్థులు ఉన్నారని భవిష్యత్తులో కూడా ఇదే పరంపరను కొనసాగిస్తామని తెలిపారు.